క్లుప్తంగా

నేడు సమావేశం

చిప్పగిరి: ఆలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించే సమావేశానికి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు తరలిరావాలని ఎంపీపీ జూటూరు హేమలత పిలుపునిచ్చారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ గృహ సారథులు, కన్వీనర్లు ప్రభుత్వ ఆశయ సాధనకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో వారికి బాధ్యతలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆస్పరిలో 7వ తేదీన..

ఆస్పరి: ఈనెల 7వ తేదీన ఆలూరులో గృహ సారథుల శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వలంటీర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పకుండా హాజరు కావాలన్నారు. శిక్షణా కార్యక్రమానికి మంత్రి గుమ్మనూరు జయరాం, సోదరులు శ్రీనివాసులు, నారాయణస్వామి హాజరు కానున్నట్లు చెప్పారు.

నేడు కేంద్ర బృందం రాక

నందవరం: నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం సోమవారం నందవరం మండలంలోని నాగలదిన్నె, మిట్టసోమాపురం గ్రామాలను సందర్శించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, పథకాల పారదర్శకత గురించి తెలుసుకోవడానికి కేంద్ర బృందం వస్తున్నట్లు వివరించారు. ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలతో సామావేశం ఉంటుందన్నారు. అలాగే మంగళవారం ముగతి గ్రామంలో గ్రామసభ ఉంటుందని చెప్పారు. మండలంలోని ఆయా శాఖ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

నేడు బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో లాలూస్వామి ఉరుసు సందర్భంగా సోమవారం రాష్ట్రస్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆసక్తి కలిగిన వృషభాల యజమానులు ఉదయం 8 గంటల్లోపు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. పేర్ల నమోదు, వివరాలకు 96520 25099, 77026 30416 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

మట్టి పనుల పరిశీలన

మద్దికెర: మండల కేంద్రంలో ఈనెల 7న జరగబోయే మద్దమ్మ తిరునాల సందర్భంగా రోడ్డుపై మట్టి పనులు చేస్తున్నారు. ఆదివారం జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, పంచాయతీ సలహాదారుడు ఆంజనేయులు పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం, రథోత్సవం సందర్భంగా ఆయా పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎంపీటీసీ ఆంజనేయులు, నాయకులు శ్రీనివాసులు, కిట్టి ఉన్నారు.

కార్యకర్తలకు శిక్షణ

పత్తికొండ రూరల్: స్థానిక షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో బీజేపీ ఓబీసీ మోర్చా నంద్యాల, కర్నూలు జిల్లా నాయకులు, కార్యకర్తలకు ఆదివారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, శిక్షణ ఇన్‌చార్జ్ రంజిత్‌కర్ని ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడారు. బీజేపీ నాయకులు రంగాగౌడు, ఓబీసీ మోర్చా పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఆలూరు రూరల్: క్రీడలతో మానసికోల్లాసం లభించి, ఒత్తిడి తగ్గుతుందని ఆలూరు సీఐ ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల-2 మైదానంలో జర్నలిస్టులు, పోలీసులు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పోలీసు జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 126 పరుగులు చేసింది. ఎస్ఐలు రామానుజులు, మల్లికార్జున బ్యాటింగ్‌లో ప్రతిభ కనబర్చారు. ఛేదనకు దిగిన జర్నలిస్టుల జట్టు 12 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 94 పరుగులు మాత్రమే చేయగలిగింది. గోపాల్,రాజు, నాగరాజు రాణించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు స్వరూప్ కుమార్, సుంకన్న విన్నర్, రన్నర్ జట్లకు షీల్డులు అందజేశారు.

కేంద్ర విద్యా విధానంలో లోపాలు

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాల్లో ఎన్నో లోపాలున్నాయని వాటిలో మార్పులు అవసరమని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కరెకృష్ణ పేర్కొన్నారు. విద్యారంగ సమస్యల పరిరక్షణపై ఈనెల 7న కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా కరపత్రాలను ఆదివారం స్థానిక డీటీఎఫ్ కార్యాలయంలో విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం రద్దు, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు

గోనెగండ్ల: మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఉదయం ఆయన పోలీస్ స్టేషన్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు లేని 15 మందికి జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, అతివేగంగా వాహనాలు నడుపరాదన్నారు. పెండింగ్ చలానాలు చెల్లించాలని కోరారు.

మెట్ట భూముల్లో జల సవ్వడి

- వైఎస్సార్ జలకళతో ఉచితంగా బోర్లు
- పథకం అమలులో పత్తికొండ క్లస్టర్ రికార్డు
- రైతు కుటుంబాల్లో వెల్లివిరుస్తున్న ఆనందం



వైఎస్సార్ జలకళ ద్వారా వేసిన బోరులో ఉబికివస్తున్న నీరు

పత్తికొండటౌన్: జిల్లాలో కరువు ప్రాంతమైన పత్తికొండ నియోజకవర్గంలో వైఎస్సార్ జలకళ పథకం ద్వారా మెట్టభూముల్లో జల సిరులు ఉప్పొంగుతూ రైతు కుటుంబాల్లో ఆనందం నింపుతున్నాయి. రైతులకు ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉచితంగా బోర్లు వేసేందుకు వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రారంభించారు. కనిష్ఠంగా 2.5 ఎకరాల నుంచి గరిష్ఠంగా 5 ఎకరాల్లోపు భూమి కలిగిన రైతులకు ఉచితంగా బోర్లు వేసి మెట్ట భూములకు సాగునీరు అందిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల మంది రైతులకు ఉచితంగా వ్యవసాయ బోర్లు వేసేందుకు ప్రభుత్వం రూ.2340 కోట్లు కేటాయించింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు క్రింద వైఎస్సార్ జలకళ పథకాన్ని అమలు చేస్తున్నారు. డ్వామా ప్రాజెక్టుకు కర్నూలు జిల్లాలో నాలుగు క్లస్టర్లు ఉన్నాయి. పత్తికొండ క్లస్టర్ వైఎస్సార్ జలకళ బోర్లు వేయడంలో రికార్డు సాధించింది. జిల్లాలో ప్రాజెక్టు డైరెక్టర్, క్లస్టరు పరిధిలో అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్లు, మండలస్థాయిలో ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు ఈ పథకం అమలును పర్యవేక్షిస్తున్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక చొరవతో ఈ నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ఎక్కువ మంది రైతులకు ఉచితంగా బోర్లు వేశారు.

అర్హులైన రైతులకు బోర్లు



పత్తికొండ క్లస్టర్ పరిధిలో అర్హులైన రైతులకు వైఎస్సార్ జలకళ పథకం కింద ఉచితంగా బోర్లు వేయించాం. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సహకారంతో విజయవంతంగా లక్ష్యాన్ని పూర్తి చేశాం. పత్తికొండ క్లస్టర్ జిల్లాలోనే గాకుండా రాష్ట్ర స్థాయిలోనూ మెరుగైన ఫలితాలను సాధించింది. రైతుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది.

– పద్మావతి, ఏపీడీ, డ్వామా



పత్తికొండ క్లస్టర్ పరిధిలో మండలాల వారీగా వేసిన బోర్ల వివరాలు

మండలం	వేసిన బోర్లు	నిధులు రూ.లక్షలలో	నీళ్లు పడిన బోర్లు
పత్తికొండ	121	108.56	110
తుగ్గలి	451	478.24	428
మద్దికెర	87	90.27	81
దేవనకొండ	65	78.22	64
ఆస్పరి	54	48.61	43
కోడుమూరు	18	20.11	15
మొత్తం	796	824.02 లక్షలు	741

పేద రైతులకు వరం

మాలాంటి చిన్న, సన్నకారు రైతులకు వైఎస్సార్ జలకళ పథకం ఒక వరం. మా పొలంలో ఉచితంగా బోరు వేశారు. నీళ్లు పడ్డాయి. ఇక నుంచి పంటల సాగులో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– లక్ష్మి, రైతు, రాంపల్లి గ్రామం

నీళ్లు పుష్కలంగా పడ్డాయి

మాకు 2.54 ఎకరాల భూమి ఉంది. ఇందులో వైఎస్సార్ జలకళ కింద ఉచితంగా బోరు వేశారు. 280 అడుగుల లోతు డ్రిల్లింగ్ చేశారు. నీళ్లు పుష్కలంగా పడ్డాయి. ఎలాంటి ఖర్చు లేకుండా మాలాంటి పేద రైతులకు సీఎం జగనన్న ఉచితంగా బోర్లు వేయించడం ఆనందంగా ఉంది. మా కుటుంబం జీవనాధారానికి ఎంతగానో తోడ్పడుతుంది.

– నరసింహప్ప, రైతు, దేవనబండ

జిల్లాలో క్లస్టర్ల వారీగా వేసిన బోర్ల వివరాలు

క్లస్టరు	వేసిన బోర్లు	నిధులు రూ.కోట్లలో	నీళ్లు పడిన బోర్లు
పత్తికొండ	796	8.24	741
ఆలూరు	332	2.99	299
ఎమ్మిగనూరు	232	2.16	194
కర్నూలు	57	0.47	44
మొత్తం	1,417	13.87కోట్లు	1278

రైతు బాంధవుడు సీఎం జగన్



బనవాసిలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: రైతు బాంధవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బనవాసి గ్రామంలో రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారన్నారు. ఎరువులు, విత్తనాల కోసం రైతులు పట్టణాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి అండగా నిలిచారన్నారు. ఆర్బీకేల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు అన్ని సదుపాయాలను గ్రామాల్లోనే కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, సర్పంచ్ బి.లక్ష్మీదేవి, నల్లారెడ్డి, వివిధ శాఖల అధికారులు, నాయకులు, సచివాలయ, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి తదితరులు

హొళగుంద: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ కర్నూలు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి అన్నారు. ఆదివారం హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా హొళగుందలో ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డీఎస్ బాషా ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాలు, కులాలు, రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని పూరిస్తుందన్నారు. ప్రతి కర్యకర్త, నాయకులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ ప్రెసిడెంట్ సుధాకర్‌బాబు, రాయలసీమ కో-ఆర్డినేటర్ శ్రీరాములు, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ బజారప్ప, తదితరులు పాల్గొన్నారు.

సీఐకు ఘన సన్మానం



సీఐ బీఏ మంజునాథ్‌ను సన్మానిస్తున్న ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్, టౌన్, రూరల్ సీఐ, ఎస్ఐలు

ఎమ్మిగనూరురూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పని చేసి బదిలీపై వెళ్తున్న సీఐ బీఏ మంజునాథ్‌ను ఆదివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు వస్తుందని చెప్పారు. అనంతరం సీఐ మంజునాథ్‌ను శాలువా, పూలమాలలతో సన్మానించారు. పట్టణ, రూరల్ సీఐలు మదుసుధన్‌రావు, కె.మోహన్‌రెడ్డి, ఎస్ఐలు మస్తాన్‌వలి, సునీల్‌కుమార్, మహేష్‌కుమార్, తిమ్మారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఫార్మేటివ్-3 పరీక్షలు

తుగ్గలి: మండలంలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 7వ తేదీ నుంచి 10 వరకు ఫార్మేటివ్-3 పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ రామ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. పరీక్షలకు సంబంధించి ప్రశ్న పత్రాలను ఆయా పాఠశాలలకు సోమవారం చేరుస్తామన్నారు.

రాష్ట్రాల మధ్య కేంద్రం చిచ్చు

పత్తికొండ రూరల్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల మధ్య చిచ్చు పెడుతూ కాలయాపన చేస్తోందని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ అన్నారు. ఆదివారం స్థానిక చదువుల రామయ్య భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తూ, కర్ణాటకలోని భద్ర ప్రాజెక్టుకు రూ.5300 కోట్లు కేటాయించిందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దిగువ ప్రాంతాలకు నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం స్పందించి ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని కోరారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పీఎం వికాస్ పథకం ప్రారంభం హర్షణీయం

పత్తికొండ రూరల్: ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ పథకం (పీఎం వికాస్) ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక కార్యాలయం నుంచి ర్యాలీగా నాలుగు స్తంభాల కూడలికి చేరుకుని జాతిపిత మహాత్మాగాంధీ, అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగాగౌడు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపిశ్రీనివాస్, ఐటీ సెల్ కన్వీనర్ రంజిత్ కర్ణి మాట్లాడుతూ చేతి వృత్తుల ప్రోత్సాహకానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు పూనా మల్లికార్జున, దండి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులు సమర్థవంతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న నారాయణస్వామి, పాల్గొన్న మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి



హాజరైన సచివాలయ మండల కన్వీనర్లు, గృహసారథులు

ఆలూరు: ప్రభుత్వం నిర్దేశించిన సూచనల మేరకు సచివాలయ, మండల కన్వీనర్లు, గృహ సారథులు సమర్థవంతంగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, స్థానిక నాయకుడు నారాయణ స్వామి పిలుపునిచ్చారు. స్థానిక ఎల్లార్తి రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో హాలహర్వి, హొళగుంద మండలాలకు చెందిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన అంశాలను పక్కాగా పాటించాలన్నారు. సంక్షేమ పథకాలకు అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత, గత ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీలు నెట్టికంటమ్మ, షేకున్ బీ, సింగిల్ విండో అధ్యక్షులు మల్లికార్జున, శ్రీనివాసులు, నాయకులు మల్లికార్జున రెడ్డి, భీమప్ప, షఫివుల్లా, లింగప్ప, శేషప్ప, వెంకట రెడ్డి, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా సేవలందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: సచివాలయ గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సూచించారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో గోనెగండ్ల మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతనంగా నియమితులైన కన్వీనర్లు అంకితభావంతో పనిచేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని సూచించారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరంగా తెలియజేయాలన్నారు. గృహసారథులకు వైఎస్సార్‌సీపీ రూ.2 లక్షల ప్రమాద బీమా, ఆరోగ్య బీమా కల్పిస్తుందన్నారు. ఎంపీపీ టి.నసురుద్దీన్, ఉపాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు మన్సూర్, నాయకులు బందెనవాజ్, నాగేష్ నాయుడు, గిడ్డయ్య, మురళీ నాయుడు, మల్లికార్జునరెడ్డి, శివరాముడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ నజీర్‌అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

నందవరం: ఈ నెల 11వ తేదీన నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ మహేష్‌కుమార్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దంపతుల గొడవలు, అక్రమ మద్యం తదితర కేసుల్లో కక్షిదారులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ.. పరిష్కరించదగిన కేసుల్లో రాజీ మార్గమే ఉత్తమమని పేర్కొన్నారు. చిన్న చిన్న గొడవలకు కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతూ వ్యయప్రయాసలకు గురికాకుండా రాజీ చేసుకోవడం మేలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు

ఆస్పరి: మండలంలోని అట్టికల్లులో దస్తగిరిస్వామి, నగరూరులో బడేసాహెబ్ ఉరుసు ఉత్సవాలు ఆదివారం జియారత్‌తో ముగిశాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా



బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ

మద్దికెర: శనగ కట్టెను తరలిస్తున్న ట్రాక్టర్ ట్రాలీ ఆదివారం అదుపుతప్పి కిందపడింది. రోడ్డు మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పగా వెనుక ఉన్న ట్రాలీ కనెక్షన్ విడిపోయి బోల్తా పడింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కొత్తిమీర రైతుకు కష్టకాలం



గోనెగొండ్ల సమీపంలో కొత్తిమీర పంటను గొర్రెలకు మేతగా వదిలేసిన దృశ్యం

గోనెగండ్ల: రోజురోజుకు కొత్తిమీర ధర పడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనేందుకు వ్యాపారస్తులు సైతం ముందుకు రావడం లేదు. చేసేది లేక కొత్తిమీర సాగుచేసిన రైతులు మనోవేదన చెందుతున్నారు. గోనెగండ్లకు చెందిన లక్ష్మన్న ఎకరా పొలంలో రూ.80 వేలు ఖర్చు పెట్టి కొత్తిమీర సాగుచేశాడు. గిట్టుబాటు ధర లేకపోవడంతో కొత్తిమీర పంటను గొర్రెలకు మేతగా వదిలేశాడు. అదేవిధంగా మండలంలో దాదాపు 200 ఎకరాల్లో రైతులు కొత్తి మీర సాగుచేశారు. ప్రభుత్వం స్పందించి కొత్తిమీరకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



ప్రతిష్ఠ సందర్భంగా భక్తుల కోలాహలం

వెల్దుర్తి: మండల పరిధిలోని కృష్ణాపురంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సుంకులమ్మ, మారెమ్మ దేవతా విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కలుగొట్ల బాబయ్య బృందం ఆధ్వర్యంలో యాగాలు, హోమాలు, మంత్రోచ్చరణల మధ్య మూడ్రోజులుగా ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ప్రతిష్ఠ సందర్భంగా గ్రామస్తుల ఇళ్లకు చేరుకున్న బంధుగణం, ఆడపడుచులతో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతిష్ఠ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, సమీర్‌కుమార్ రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంగవరంలో శివపూజ

నందవరం: గంగవరం గ్రామంలో శివపూజ అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆదివారం గురుస్వాములు వీరుపాక్షిరెడ్డి ఇంటి ఆవరణలోని మండపంలో స్వాములు ఈరన్న, దేవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో 50 మంది శివస్వాములు పూజ చేపట్టారు. మండపంలో స్వామివారి పటాలు, కలశాన్ని పూలమాలలతో అలంకరించారు. అనంతరం దేవుళ్లకు జలాభిషేకం, కుంకుమార్చన, మెట్లపూజ, ఆకుపూజ, పంచామృతాభిషేకం పూజలు నిర్వహించారు. శివనామ స్మరణ, భక్తి గీతాలు, భజన పూజలు, భక్తులకు అన్నదానం చేశారు.

వరహాల తాత ఉరుసు

కృష్ణగిరి: చిట్యాల గ్రామంలో వెలసిన భక్తుల ఆరాధ్య దైవం.. అడిగే వారికి వరహాలు ఇచ్చే తాత లాలూ స్వామి ఉరుసు ఆదివారం గ్రామస్తులు వైభవంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున వివిధ గ్రామాల నుంచి వచ్చిన మంగళ వాయిద్య కళాకారుల మధ్య గంధంను అశ్వంపై తీసుకువచ్చి స్వామికి సమర్పించారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులందరూ దర్గాకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. గ్రామంలో ఎగ్జిబిషన్, స్వీట్, గాజుల అంగళ్లతో సందడి నెలకొంది.

గోపుర కలశ ప్రతిష్ఠ

హొళగుంద: మండల కేంద్రంలోని విరక్తమఠం (ఉరవ కొండ మఠం)లో ఆదివారం ఈశ్వరలింగ, ఆలయ గోపుర కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమంతో పాటు ఇతర పూజలు ఘనంగా జరిగాయి. గంగిపూజ, గోపూజ, విష్ణు సహస్రనామ హోమాలు చేపట్టారు. జే హొసళ్లికి చెందిన అజాది శంభులింగ మహాస్వాములచే గోపుర కలశ ప్రతిష్ఠ, రావి, వేప చెట్టుకు లింగారాధణ, ప్రాణ ప్రతిష్ఠ చేసి పూజలు నిర్వహించారు. పరమేశ్వర స్వామి సమాధి నూతన కట్టడానికి ప్రత్యేక పూజలు జరిపారు. శంభులింగ మహాస్వామి మాట్లాడుతూ.. భక్తులు ఆధ్యాత్మిక దైవ చింతనను అలవర్చుకోవాలని సూచిస్తూ అనేక అంశాలపై ఉపదేశం చేశారు.



కౌలుట్ల చెన్నకేశవ స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఆలూరులో బసవేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

కనులపండువగా రథోత్సవం

ఆలూరు: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ ఫారెస్ట్‌లో కొలువుదీరిన కౌలుట్ల చెన్నకేశవ స్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ హనుమంత రెడ్డి, ఈఓ బి.చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో ఉదయం స్వామివారికి కుంకుమార్చన, ఫల, పుష్ప, శాంతి హోమం, పంచామృతాభిషేకం, మహామంగళహారతి తదితర పూజలు జరిపించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామిని రథంపై కొలువుంచి భక్తుల జయజయధ్వనాల మధ్య ఆలయం నుంచి ఎదురు మండపం వరకు లాగారు. రథోత్సవంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర స్వామి రథోత్సవం

ఆలూరు రూరల్: హాలహర్వి మండలంలోని బాపురం గ్రామంలో కొలువైన బసవేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం సాయంత్రం కమనీయంగా సాగింది. ముందుగా స్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు వేలాది భక్తుల నడుమ రథోత్సవం కమనీయంగా సాగింది. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

నిరుపయోగంగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు



తిమ్మాపురంలో వృథాగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు

చిప్పగిరి: తిమ్మాపురంలో రూ.15 లక్షలతో నిర్మించిన 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు గత పదేళ్లుగా వినియోగానికి నోచుకోక నిరుపయోగంగా ఉంది. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో 2012లో తాగు నీటి అవసరాల కోసం ట్యాంకును నిర్మించారు. పాలకుల నిర్లక్ష్యమో? అధికారుల పర్యవేక్షణ లోపమో? ఏమో గానీ పదేళ్లు గడిచినా ట్యాంకు వినియోగానికి నోచుకోలేదు. అధికారులు స్పందించి ట్యాంకును వినియోగంలోకి తెచ్చి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.